క్లుప్తంగా

బెల్లం ఊట ధ్వంసం



ఆలంకొండలో బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న సెబ్ పోలీసులు

కోడుమూరు రూరల్: కోడుమూరు సెబ్ పరిధిలోని క్రిష్ణగిరి మండలం ఆలంకొండలో శుక్రవారం సెబ్ పోలీసులు దాడులు నిర్వహించారు. నాటుసారా తయారీకి సిద్ధంగా ఉన్న 800 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. బట్టీ నిర్వాహకుడుపై కేసు నమోదు చేసినట్లు సెబ్ సీఐ రామాంజినేయులు తెలిపారు. దాడుల్లో సెబ్ ఎస్ఐ ఆలీబేగ్, సిబ్బంది అన్సర్ బాషా, వెంకటేష్‌నాయక్, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తెల్లదోమ నివారణ చర్యలు తీసుకోండి



పత్తిపంటను పరిశీలిస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: రైతులు పత్తి పంటల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని ఏఓ మల్లేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని బురాన్‌దొడ్డి, క్రిష్ణదొడ్డి, బ్యాతోలి గ్రామాల్లో పర్యటించారు. పత్తి, కంది పంటలను పరిశీలించారు. పత్తి పంటలో తెల్లదోమను గమనించిన ఏఓ పంట సంరక్షణకు రైతులకు సూచనలు చేశారు. లీటరు నీటిలో గ్రాము అసిటామ్ ప్రైడ్, లీటరు నీటిలో ఒక ఎంఎల్ మోనోక్రోటో ఫాస్ కలిపి పత్తిపైరుపై పిచికారీ చేయాలని సూచించారు.అదేవిధంగా బురాన్‌దొడ్డి గ్రామంలోని రైతు సేవా కేంద్రాన్ని ఏఓ తనిఖీ చేశారు. రికార్డులను, ఎరువుల నిల్వలను పరిశీలించారు.కార్యక్రమంలో ఎంపీఈఓ వెంకటేష్, వీఏఏ మారెప్ప, రైతులు పాల్గొన్నారు.

సన్మానం



ఎంపీడీఓ శకుంతలను సన్మానిస్తున్న అధికారులు

సి.బెళగల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సి.బెళగల్ ఎంపీడీఓగా విధులు నిర్వర్తించిన శకుంతల సొంత జిల్లా అనంతపురానికి బదిలీ అయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీపీ బొంతల మునెప్ప ఆధ్వర్యంలో ఎంపీడీఓ శకుంతలను ఘనంగా సన్మానించారు. రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఆమెకు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఓర్వకల్లు: మండలంలోని సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సునీల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండవ శనివారం స్టేషన్లల్లో నిర్వహణ పనులలో భాగంగా ఓర్వకల్లు, నన్నూరు, ఉయ్యాలవాడ, కాల్వబుగ్గ సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల గృహాలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

ఘనంగా ప్రపంచ ఆదివాసి దినోత్సవం

కల్లూరు: ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని ఓబులాపురం తండా గ్రామంలో శుక్రవారం ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని జిల్లా వైద్యశాఖ అధికారి (డిఎంహెచ్ఓ) డాక్టర్ భాస్కర్‌తో కలిసి జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ జడ్జి లీల వెంకట శేషాద్రి ప్రారంభించారు. తండా వాసులకు డాక్టర్లు ఆరోగ్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సహెరాబీ, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ రఘు, డాక్టర్ ఆనందరావు, డాక్టర్ నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మానవ విలువలపై అవగాహన



మాట్లాడుతున్న ప్రొఫెసర్ సునీల్‌కుమార్

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం మానవ విలువపై సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సుకు కేరళ రాష్ట్రం కొచ్చి యూనివర్సిటీ నుంచి ప్రొఫెసర్ సునీల్ కుమార్ హాజరయ్యారు. ఆపదలో ఉన్న వారికి సాయం, ప్రస్తుతం బంధాల పరిస్థితులు, స్నేహం గొప్పదనం తదితర విషయాలను ప్రొఫెసర్ సునీల్‌కుమార్ వివరించారు.

అమానుష చర్య



రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహంపై దాడి అమానుష చర్య. ప్రభుత్వం సంస్థలు కొలువుదీరిన విజయవాడలోనే ఇలాంటి ఘటనల చోటుచేసుకోవడం అంత్యంత దారుణం. అలాంటి మహనీయుడి విగ్రహంపై దాడి సిగ్గుచేటు. ఈ ఘటనను ప్రతిఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో విచారణ చేసి కారకులను కఠినంగా శిక్షించాలి.

– పెరగు శివక్రిష్ణయాదవ్ సమాజ్‌వాదిపార్టీ జిల్లా అధ్యక్షుడు

దళితులపై దాడే...



దళితుల ఆరాధ్యదైవంగా భావించే డాక్టర్ బాబాసాహేబ్ అంబేడ్కర్ విగ్రహంపై దాడి చేయడం సిగ్గు చేటు. రాష్ట్ర పరిపాన కేంద్రమైన విజయవాడలో ఈ ఘటన చోటు చేసుకోవడం సిగ్గు చేటు. రాజ్యాంగ నిర్మాతపై దాడి చేయడం అంటే యావత్తు దళితులపైనే దాడి జరిగినట్టే. ఈ దుర్మాగానికి ఒడిగట్టిన వారిని కఠినంగా శిక్షించాలి. లేకుంటే భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ ప్రకటించాల్సి వస్తుంది.

–దేవదత్తు, మాలమహనాడు, నంద్యాల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్

దౌర్జన్యాలు..దాడులు..విధ్వంసాలు

- పెట్రేగి పోతున్న టీడీపీ అల్లరి మూకలు
- కూటమి ప్రభుత్వ పాలనపై వెల్లువెత్తుతున్న ప్రజా వ్యతిరేకత
- అంబేడ్కర్ విగ్రహంపై దాడిని ఖండించిన ప్రజా, కుల సంఘాల నేతలు
- వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు టీడీపీ మద్దతును తప్పుపడుతున్న నాయకులు

రెండు నెలలకూడా నిండని కూటమి ప్రభుత్వ పాలనపై అన్ని వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చంద్రబాబు సీఎం గద్దెనెక్కినప్పటి నుంచి దౌర్జన్యాలు... దాడులు... విధ్వంసాలు సృష్టించడమే తమ లక్ష్యం అన్నట్లుగా పెట్రేగి పోతున్న టీడీపీ మూకల తీరును ఖండిస్తున్నారు. టీడీపీ అధికారం చేపట్టాక.... వైఎస్సార్‌సీపీ శ్రేణులు, మద్దతుదారులపై విచక్షణారహితంగా దాడులకు పాల్పడడమే కాదు హత్యలకూ వెనుకాడని తెలుగుదేశం మూకలు ప్రజలను సైతం భయభ్రాంతులకు గురి చేస్తూనే ఉన్నారు. దీంతో ప్రజా, కుల సంఘాల నాయకులు టీడీపీ ప్రభుత్వ తీరును తప్పుపుడుతున్నారు. ప్రత్యేకించి ఈ నెల 9వ తేదీన విజయవాడ నడిబొడ్డున రాష్ట్రానికే తలమానికంగా ఉన్న భారత రాజ్యాం నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ధ్వంసానికి పాల్పడిన టీడీపీ మూకల విధ్వంసాన్ని ప్రతిఒక్కరూ ఖండిస్తున్నారు. అంబేడ్కర్ విగ్రహాన్నీ వదలరా అంటూ మండిపడుతున్నారు. అదేవిధంగా పార్లమెంట్‌లో బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు మద్దతు పలకడాన్ని తప్పుపడుతున్నారు ప్రజా, కుల సంఘాల నాయకులు. ఎన్నికల ముందు ముస్లింలకు అన్నివిధాలుగా అండగా ఉంటామని చంద్రబాబు మభ్యపెట్టారంటూ విమర్శిస్తున్నారు. గద్దెనెక్కేందుకు మాట ఇవ్వడం... అంతకంటే సులువుగా ఏమార్చడం బాబుకే చెల్లునని విమర్శలు గుప్పిస్తున్నారు అన్నివర్గాల ప్రజలు, నాయకులు. టీడీపీ ప్రభుత్వ తీరుపై వారి మాటల్లోనే....

– పాణ్యం/ కోడుమూరు రూరల్

ప్రతిఒక్కరూ ఖండించాలి



విజయవాడలో అత్యంత ప్రాధాన్యత క్రమంలో నిర్మించిన దళితుల ఆశాజ్యోతి, రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేడ్కర్ విగ్రహంపై దాడికి పాల్పడడం అమానుషం. రాజ్యాంగాన్ని రచించిన అంబేడ్కర్ విగ్రహం స్థూపం కింద గల శిలా ఫలకంపై వైఎస్ జగన్ పేరును చూసి, జీరిణంచుకోలేక ఛిద్రం చేయడం అన్యాయం. గాంధీ, ఎన్‌టీఆర్ విగ్రహాలపై ఏనాడూ దాడులు జరుగలేదు. ఈ దుశ్చర్యలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి.

– జిల్ల. కృష్ణ, ఎమ్మార్పీఎస్ నాయకుడు, ఓర్వకల్లు

విగ్రహాలపై దాడి పిరికి చర్య



మహనీయుల విగ్రహాలపై దాడి చేయడం పిరికి చర్య. భారత రాజ్యాంగ నిర్మాత, నిజాయితీ పరుడైన అంబేడ్కర్ విగ్రహంపై విజయవాడలో జరిగిన సంఘటన హేయం. దేశానికే ఆదర్శంగా నిలిచిన బీఆర్ అంబేడ్కర్ చేసి న సేవలు మరువలేనివి. దళితుల పాలిట దేవుడిలా భావించబడే ఆ మహనీయుని విగ్రహంపా దాడికి పాల్పడిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి.

–వై .వెంకటరమణమాదిగ, ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు, తిప్పాయపల్లె, ఓర్వకల్లు మండలం

దళితుల ఆశాజ్యోతి విగ్రహంపై దాడి దుర్మార్గం



భారత దేశంలో అంబేడ్కర్ రచించిన రాజ్యాంగ ఫలాలనే నేడు అనుభవిస్తున్నాం. గత ప్రభుత్వం రూ. 404.35 కోట్లతో అత్యాద్భుతంగా తీర్చిదిద్దారు. అలాంటి మహనుభావుడి విగ్రహంపై దాడి చేయడం దుర్మార్గమైన చర్య. రాష్ట్ర నడిబొడ్డు లో ఇలాంటి అఘయిత్యాలు జరగడం అత్యంత బాధాకరం. దాడికి పాల్పడిన వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించారు.

– గద్దల సామేల్, ఎంఆర్ పీఎస్ రాష్ట్ర నాయకులు

దుండగులను కఠినంగా శిక్షించాలి



విజయవాడలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హాయంలో ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసేందుకు టీడీపీ శ్రేణులు పూనుకోవడం దారుణం. మంచిని జీర్ణించుకోలేని టీడీపీ నాయకులు, వారి గుండాలు చీకటిలో సామాజిక న్యాయ శిల్పంపై దాడులు చేయడం పిరికిపంద చర్య. ఇకనైనా ప్రభుత్వ పెద్దలలో మార్పులు రావాలి. లేకపోతే ప్రజలే తిరగబడి కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారు.

– అరుణ్‌కుమార్,సి.బెళగల్

మద్దతును టీడీపీ ఉపసంహరించుకోవాలి



బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్లో ప్రవేశపెట్టిన వక్ఫ్‌బోర్డు బిల్లు సవరణకు టీడీపీ మద్దతు తెలపడం దారుణం. వక్ఫ్‌బోర్డుల ఆస్తులపై పెత్తనానికి బీజేపీ యత్నిస్తోంది. దర్గా, మసీదు, వక్ఫ్ ఆస్తులకు స్వాధీనం చేసుకునేందుకు కుట్రలు పన్నుతోంది. టీడీపీ ప్రభుత్వం వెంటనే తమ మద్దతును ఉపసంహరించుకోవాలి. చట్టం పేరుతో భూములను ఇష్టానుసారంగా వినియోగించుకోవాలని బీజేపీ కుట్ర పన్నుతుంది. వక్ఫ్ భూములపై పెత్తనాన్ని సహించం. చట్టాన్ని అడ్డు పెట్టుకుని మసీద్, దర్గా, వక్ఫ్ భూములను, ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని కేంద్రం భావించడం సమంజసం కాదు.

– గఫూర్‌మియ్యా, అవాజ్ కమిటీ నాయకుడు, కోడుమూరు

దుండగలపై కఠిన చర్యలు తీసుకోవాలి

కల్లూరు : విజయవాడ నడిబొడ్డున ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం విధ్వంసానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. శివ ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళిత, బడుగు, బలహీన వర్గాల ప్రజల ఆత్మాభిమానాన్ని దెబ్బ తీయడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వ పాలన కొనసాగిస్తుంది. ఈ సంఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమాజానికి క్షమాపణ చెప్పాలి. లేని పక్షంలో ప్రజా, కుల సంఘాలతో కలిసి ఆందోళనలు చేపడుతామని ఆయన హెచ్చరించారు.

పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తున్నాం

- మంత్రి టీజీ భరత్



పారిశ్రామిక హబ్‌కు సంబంధించిన ఫీల్డు మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యే గౌరు చరిత

ఓర్వకల్లు: ఓర్వకల్లు ప్రాంతంలో పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. శుక్రవారం పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డితో కలిసి పూడిచెర్ల వద్ద ఉన్న ఇండస్ట్రియల్ పార్కు శిలాఫలకం, గుట్టపాడు వద్ద స్థాపిస్తున్న స్టీల్ ప్లాంట్ పరిశ్రమను మంత్రి భరత్ పరిశీలించారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన నీరు, విద్యుత్, ఇతర మౌలిక సదుపాయాల కల్పనపై ఏపీఐఐసీ అధికారులతో చర్చించారు. అనంతరం స్టీల్ ప్లాంట్ పరిశ్రమను సందర్శించి ఫ్యాక్టరీ యాజమాన్యం, ఏపీఐఐసీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. స్టీల్ ఫ్యాక్టరికీ సంబంధించిన వివరాలను మంత్రి, ఎమ్మెల్యేకు యాజమాన్యం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జయరాజ్ ఇస్మాత్ ఆధ్వర్యంలో స్థాపిస్తున్న స్టీల్ ఫ్యాక్టరీ అభివృద్ధికి తమ వంతు సహకారాలు అందజేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌కు రూ.18 వేల కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ, పారిశ్రామిక హబ్‌ను అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ ఎండీ కొయాంక, కర్నూలు ఆర్డీఓ శేషిరెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోమశేఖర్‌రెడ్డి, ఎండస్ట్రీస్ జీఎం మారుతి ప్రసాద్, తహసీల్దార్ వెంకటరమణ, టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కమనీయం ...శింగరయ్య స్వామి రథోత్సవం

సి.బెళగల్: మండలంలోని పోలకల్ గ్రామంలో వెలసిన సద్గురు శింగరయ్య స్వామివారి జయంతి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం స్వామివారి మహా రథోత్సవంను పీఠాధిపతులు రాజరత్నం శెట్టి ఆధ్వర్యంలో కమనీయంగా సాగింది. పీఠాధిపతి ఇంటినుంచి మొదలైన కుంబంకాగు ఊరేగింపు ఆలయం చేరుకుంది. హోమం అనంతరం స్వామి వారి ఉత్సవమూర్తిని రథంపై ఉంచి భక్తులు గోవిందనామం స్మరిస్తూ రథాన్నిలాగారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి రథోత్సవాన్ని తిలకించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులను చెల్లించుకున్నారు. భక్తులకు వసతి, భోజన సదుపాయాలను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ఎస్ఐ పీరయ్య పోలీస్ బందోబస్తు పర్యవేక్షించారు. అదేవిధంగా మండల కేంద్రం సి.బెళగల్‌లోనూ శింగరయ్యస్వామి చిత్రపటాన్ని ఎద్దుల బండిపై ఊరేగించారు. తూర్పు ఆంజనేయ స్వామి గుడి నుంచి ప్రారంభమైన ఊరేగింపు పడమటి ఆంజనేయ స్వామి, శ్రీరంగస్వామి ఆలయాల వరకు సాగింది.



శింగరయ్య రథోత్సవాన్ని తిలకించేందుకు తరలివచ్చిన భక్తులు (ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో శింగరయ్య స్వాములవారి మూలవిరాట్

మండలంలో ఘనంగా పంచమి వేడుకలు

సి.బెళగల్: మండల పరిధిలోని వివిధ గ్రామాలలో శుక్రవారం నాగుల పంచమిని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. భక్తులు పుట్టలకు పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. నూతన వధువరులు నాగు దేవతల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు.

కార్పొరేట్ శక్తులను తరిమికొట్టండి



డీటీకి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఓర్వకల్లు: కార్పొరేట్ శక్తులను దేశం నుంచి తరిమికొట్టాలని సీఐటీయూ జిల్లా నాయకులు ప్రభాకర్ రెడ్డి పులుపునిచ్చారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో 'క్విట్ ఇండియా' కార్యక్రమం నిర్వహించారు. సీఐటీయూ మండల నాయకులు షాజాహాన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా నాయకులు ప్రభాకర్‌రెడ్డి, వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న, ఏపీ రైతు సంఘం మండల నాయకులు మధుసూదన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ క్విట్ ఇండియా స్ఫూర్తితో ప్రభుత్వ రంగ సంస్థల నుంచి వ్యవసాయ రంగాల నుంచి కార్పొరేట్ శక్తులను దేశం నంచి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకు మూడు వ్యవసాయ నల్ల చట్టాలను తీసుకొచ్చి కార్మికులు, రైతులకు అన్యాయం చేశారని విమర్శించారు. అనంతరం వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ సుదర్శన్‌కు అందజేశారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు మల్లేష్, మాసూంబాష, దస్తగిరి, శేషయ్య, ఎర్రమల, బషీర్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

కల్లూరు: మండల పరిధిలోని పెద్దటేకూరు గ్రామంలో రైతు కురువ రాముడు సాగు చేసిన కంది పంటను శుక్రవారం ఏఈఓ డేవిడ్, ప్రకృతి వ్యవసాయ ఇన్‌చార్జ్ ఎంటీ షేక్ మాబూవలి పరిశీలించారు. పంటమార్పిడి, పకృతి వ్యవసాయం ప్రయోజనాలను వారు రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీఈఓ ప్రణీత, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నరసింహులు, ఓమేశ్వర్‌రెడ్డి, కృష్ణుడు, సుజాత పాల్గొన్నారు.

పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ వేగవంతం చేయాలి

కర్నూలు(అగ్రికల్చర్): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల కంప్యూటరీకరణను వేగవంతం చేయాలని సహకార శాఖ కమిషనర్ ఎ.బాబు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పాలక వర్గాలను ఆదేశించారు. శుక్రవారం గుంటూరు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ.. కంప్యూటరీకరణ వల్ల పీఏసీఎస్‌ల్లో ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వస్తాయని, లావాదేవీలు వంద శాతం పారదర్శకంగా ఉంటాయన్నారు. అక్టోబరు 2 నుంచి ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. పైలెట్ ప్రాజెక్టుగా ప్రతి జిల్లాలో రెండు పీఏసీఎస్‌ల్లో ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని, అలాగే అన్ని సంఘాల్లోనూ పనులు చేపట్టాలన్నా. కర్నూలు నుంచి అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్, ఇన్‌చార్జీ జేసీ మధుసూదన్‌రావు మాట్లాడుతూ.. పసుపల, సీ.బెళగల్ పీఏసీఎస్‌లను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి కంప్యూటరీకరణ పనులు చేపడతామన్నారు. డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఈఓ విజయకుమార్, జీఎం రామాంజనేయులు, జిల్లా సహకార అధికారి ఎస్.రామాంజనేయులు, సహకార ఆడిట్ అధికారి శిరీష, ఆదోని డీఎల్‌సీఓ జాఫ్రిన్, డీజీఎం సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

టీడీపీ మద్దతు పలకడం దారుణం



సమావేశంలో మాట్లాడుతున్న ఆవాజ్ కమిటీ జిల్లా అధ్యక్షుడు ముస్తఫా

కోడుమూరు రూరల్: పార్లమెంట్‌లో బీజేపీ ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు తెలుగుదేశం ప్రభుత్వం మద్దతు పలకడం దారుణమని ఆవాజ్ కమిటీ జిల్లా అధ్యక్షులు ముస్తఫా ఖండించారు. కోడుమూరులో శుక్రవారం శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన టీడీపీ తీరును తప్పుపట్టారు. బీజేపీ ప్రభుత్వం మాదిరిగానే తెలుగు దేశం సర్కార్ కూడా ముస్లింలకు అన్యాయం చేయాలని చూస్తోందన్నారు. పార్లమెంట్లో ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లును లౌకిక ప్రజాస్వామ్యవాదులందరూ వ్యతిరేకించాలన్నారు. బీజేపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి నేటి వరకు ముస్లిం మైనార్టీలను విద్య, సామాజిక, ఆర్థిక, రాజకీయంగా బలహీన పరిచేందుకు యత్నిస్తోందని విమర్శించారు. ఇకనైనా బీజేపీ, టీడీపీ ప్రభుత్వాలు తమతీరును మార్చుకుని, ముస్లింల సంక్షేమానికి కృషి చేయాలని, లేని పక్షంలో ప్రజావ్యతిరేకతను చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో స్థానిక ఆవాజ్ కమిటీ నాయకులు ఖాజా ఇషాక్, హుసేన్ పీరా, దావూద్, హీరావలి, మిన్నల్లా, ఖాజా, రఫీక్, మాలిక్, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నాప్ కేసులో నిందితుల అరెస్ట్

కర్నూలు: కర్నూలులోని శ్రీరాం నగర్‌లో నివాసముంటున్న సల్కాపురం ప్రవీణ్‌కుశాల్ కిడ్నాప్ కేసులో నిందితులను 3వ పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. గురువారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్తున్న ప్రవీణ్‌కుశాల్‌ను సమీప కాలనీలో అడ్డుకుని పర్ల పెద్ద మద్దిలేటితో పాటు స్నేహితులు కందోలి అనిల్‌కుమార్, మేకపోగు సురేష్, గూడూరు భాస్కర్‌రెడ్డి, తేజ, మిథున్ తదితరులు తమ వాహనంలో కిడ్నాప్ చేశారు. కుశాల్ తండ్రి సల్కాపురం రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి పక్కా ఆధారాలతో నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం బయటపడింది. ప్రవీణ్ కుశాల్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ పలువురితో ఆర్థిక లావాదేవీలు నడిపాడు. పర్ల గ్రామానికి చెందిన పెద్ద మద్దిలేటికి గత ఎన్నికల్లో కోడుమూరు అసెంబ్లీ నియోజకవర్గం టిక్కెట్ ఇప్పిస్తానని చెప్పి రూ.2 కోట్లు తీసుకున్నాడని, ఆ డబ్బులు తిరిగి ఇప్పించుకునేందుకు కిడ్నాప్ చేసినట్లు నిందితులు అంగీకరించారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచినట్లు సీఐ మురళీధర్‌రెడ్డి తెలిపారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా, పక్కన ఎమ్మెల్యేలు

కర్నూలు(సెంట్రల్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఆదివాసీలు సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా సూచించారు. గిరిజనుల విద్యా, వైద్యం కోసం అన్ని రకాల చర్యలు తీసుకుంటానని, ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని గిరిజన సంఘాల నాయకులకు హామీ ఇచ్చారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహించారు. ముందుగా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, కేఈ శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి జ్యోతి ప్రజ్వలన గావించారు. అనంతరం గిరిజనుల సంక్షేమం కోసం పోరాడిన బిర్సాముండా, అల్లూరి సీతారామరాజు, మల్లుదొర, గంటందొరల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేస్తానన్నారు. గిరిజన విద్యార్థుల కోసం డీఎస్సీ కోచింగ్ సెంటర్, తుగ్గలిలో గిరిజన వసతి గృహాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. గిరిజన, వెనుకబడిన, సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో మరమ్మతుల కోసం రూ.11 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి మాట్లాడుతూ.. నేటికీ చాలా గిరిజన గూడేలు, తండాలకు సరైన రోడ్డు, మంచినీరు, వైద్య సదుపాయాలు లేకపోవడం బాధాకరమన్నారు. పాణ్యం నియోజకవర్గంలోని గిరిజన, చెంచుకాలనీల్లో సరైన వసతులులేవని, చాలా మందికి ఆధార్ లేకపోవడంతో సంక్షేమ పథకాలకు దూరమవుతున్నట్లు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. కనీసం రేషన్ కార్డులను ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు మాట్లాడుతూ.. పత్తికొండ ప్రాంతంలో ట్రైబల్ హ్యాండ్లూమ్‌ను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ.. గిరిజనులకు కనీస మౌలిక వసతులు కల్పించడం ప్రభుత్వాల బాధ్యత అన్నారు. అనంతరం గిరిజన సంక్షేమ పాఠశాలల్లో 10వ తరగతి ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు కలెక్టర్, ఎమ్మెల్యేలు పురస్కారాలు అందజేశారు. స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులు గిరిజన వేషధారణలో చేసిన నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఇన్‌చార్జ్ జేసీ కె.మధుసూదన్‌రావు, ఇన్‌చార్జ్ గిరిజన సంక్షేమ అధికారి రంగలక్ష్మిదేవి, గిరిజన సంఘాల నాయకులు ఆర్.కైలాష్ నాయక్, పి.గోవిందు, ఎరుకులరాజు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే



విద్యార్థులకు పుస్తకాలను అందజేస్తున్న ఆర్ఐఓ, ప్రిన్సిపాల్

కోడుమూరు రూరల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్ఐఓ గురువయ్య చేతుల మీదుగా విద్యార్థులకు ఉచితంగా నోటు, టెక్స్ పుస్తకాలు, బ్యాగులను ప్రిన్సిపాల్ పద్మావతి అందజేశారు. అలాగే ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఎంపీసీలో 470మార్కులకు 461మార్కులు సాధించిన విద్యార్థిని సెమినా తల్లిదండ్రులను సత్కరించి నగదు బహుమతిని వారు అందజేశారు. కార్యక్రమంలో కాలేజీ అభివృద్ధి కమిటీ చైర్మన్ రాముడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కోడుమూరు, పాణ్యం
70750 09147 (కోడుమూరు),
70750 09185 (పాణ్యం)
Office mail : sakshiknladvt@gmail.com